# మీడియా మాజిక్ లేక పత్రికా పక్షపాతం కథ

పిల్లలకు శలవలు కనుక సునీత, వాళ్ళను తీసుకుని ఆస్టిన్ వెళ్ళింది, విమలా వాళ్ళతో నాలుగు రోజులు గడుపుదామని. అందుకే విక్రమరావ్‌కి కొంచెం తీరిగ్గా వుంది. ఆఫీస్ వదలగానే, కారును నెమ్మదిగా రిచ్‌మండ్ రోడ్ మీద పోనిస్తూ - ఏ రెస్టారెంట్లో తిందామా అని ఆలోచిస్తున్నాడు. - రేడియోలో ఎ.బి.సి. వరల్డ్ న్యూస్ వస్తున్నది.

విక్రమరావ్‌కి ఆ న్యూస్‌ని ఎందుకు 'వరల్డ్ న్యూస్' అంటారో పదిహేనేళ్ళ నుంచీ అర్థం కావటం లేదు. ఈ దేశంలో ఎవరెవర్ని, ఎక్కడెక్కడ ఎవరు హత్య చేసిందీ, డెమోక్రాటిక్ పార్టీకి చెందిన అమెరికా ప్రెసిడెంట్ ఎంత మందితో అక్రమ సంబంధాలు పెట్టుకున్నదీ ఏకరువు పెడుతున్న రిపబ్లికన్ పార్టీ అధినేతల ఆరోపణలు, వాళ్ళ అమ్మా నాన్నలు సరిగ్గా చూడటం లేదని వాళ్ళకి విడాకులిచ్చిన ఒక అమ్మాయి కథ - ఇవన్నీ ప్రపంచ వార్తలు. అందుకే ఏదన్నా బయట ప్రపంచంలో జరిగే వార్తలు తెలుసుకోవాలంటే బి.బి.సి. వరల్డ్ న్యూస్ వినటం అలవాటు చేసుకున్నాడు విక్రమరావ్.

ఎదురుగుండా "ఆలివ్ గార్డెన్" ఇటాలియన్ రెస్టారెంట్ కనపడింది విక్రమరావ్‌కి. కడుపులో పేగులు కరకరలాడుతుండటంవల్ల, నెమ్మదిగా కారుని పార్కింగ్‌లోకి తిప్పాడు-



ఇటాలియన్ రెస్టారెంటులో పనిచేస్తున్న అందమయిన స్పానిష్ అమ్మాయి, నాన్ స్మోకింగ్ ఏరియాలో తనని కూర్చోపెట్టిన తర్వాత, విక్రమరావ్ వైట్ వైన్ ఒక బాటిల్ ఆర్డర్ చేసి, అమెరికన్ రేడియో గురించి ఆలోచిద్దామని అనుకుంటుండగా, ఎదురుగా భేతాళుడు ప్రత్యక్షమయ్యాడు.

"ఇక్కడున్నావా మహానుభావా - పోయిన యిరవై మూడు సెకండ్ల నుంచీ, నీ కోసం, హ్యూస్టన్ నగరమంతా వెతుకుతున్నాను?" అన్నాడు ఎదురుగా కూర్చుంటూ.

"నేను ఇక్కడ వున్నట్లు నీకెలా తెలిసింది?" అడిగాడు విక్రమరావ్.

"నీ జోకులకు జోహార్లు. ఇప్పటిదాకా ఐదు కథలు చెప్పుకున్నాం. ఇవాళ అమెరికా బేతాళుడి కథల్లో ఆరవ కథ చెప్పుకుందాం అని అనుకుంటున్నాం. ఇంకా నా సంగతి తెలియలేదా మహానుభావా!"

ఈలోగా వెయిట్రెస్ వచ్చింది ఆర్డర్ తీసుకోవటానికి. విక్రమరావ్‌కి తెలుసు - కావాలనుకుంటే తప్ప బేతాళుడు తనకి తప్ప ఇంకెవరికీ కనపడడు. తను ఇలా రెస్టారెంటులో కూర్చుని, వాళ్ళకు కనపడని బేతాళుడితో మాట్లాడుతుంటే చూసేవాళ్ళు పిచ్చివాడు అను కుంటారు. అందుకే ఆ అమ్మాయితో అన్నాడు - "కొంచెం ఆగిరా అమ్మా" అని, సగం మెనూ వైపు, సగం ఆ అమ్మాయి వేపు చూస్తూ.

"ఏం ఆర్డరు చెయ్యావేం - కడుపులో కాలిపోతున్నది" అన్నాడు బేతాళుడు.

"నువ్వు అదృశ్యమైన అవతారంలా కాకుండా మామూలు మనిషిలా అందరికీ కనపడుతూ కూచో - అప్పుడు మాట్లాడుకుందాం -" విసుగ్గా అన్నాడు విక్రమరావ్.


ఆరడుగుల తెల్ల అమెరికన్లా అవతారం దాల్చాడు అమెరికా బేతాళుడు - దాల్చుతూ, "నీకో విషయం చెప్పనా - మిన్ని సోటా ట్విన్స్, ఇవాళ అట్లాంటా బ్రేవ్స్‌తో వరల్డ్ సీరీస్ బేస్ బాల్ ఆడుతున్నారు కదా - అందుకని ---"

"ఏయ్ బేతాళుడూ - ఒక్కసారి ఆగుమరి - నాకో సందేహం వచ్చింది - మిన్నిసోటా వాళ్ళూ, అట్లాంటా వాళ్ళూ ఆడే బేస్‌బాల్ గేమ్ - వరల్డ్ సీరీస్ అంటావేమిటయ్యా - ఇండియాలో మణిపూర్ వాళ్ళూ - నాగాలాండ్ వాళ్ళూ ఆడే కబాడీ ఆటను వర్ల్డ్ సీరీస్ అంటామా?" అడిగాడు విక్రమరావ్.

"అవునయ్యా - మీరు ఇండియాలో అనరు - కానీ ఇక్కడ మనం అంటాం - అయినా కథలు చెప్పవలసింది నేనూ, ఆఖరిలో ప్రశ్న అడగవలసింది నేనూ - ప్రశ్నలకు జవాబులు చెప్పవలసింది నువ్వు - అదీ ఇండియా బేతాళుడి కథల్లోనూ, అమెరికా బేతాళుడి కథల్లోనూ ఆనవాయితీ. అలాంటిది నువ్వు నన్ను ప్రశ్నలడగటం ఏమీ బాగాలేదు విక్రమార్కుడూ!"- బేతాళుడు వెయిట్రస్ రావటం చూసి ఆగాడు.

"కెన్ ఐ టేక్ ది ఆర్డర్ ఫర్ యూ!" అడిగింది నవ్వుతూ.

విక్రమరావ్‌కి ఎగ్‌ప్లాంట్ పార్మిజాన్ అంట్ యిష్టం. అందుకే అది ఆర్డర్ చేశాడు. బేతాళుడు, తనకు కావలసింది ఆర్డర్ చేసి - విక్రమరావ్‌తో - "సరే ఇవాళ అమెరికా బేతాళుడి కథల్లో ఆరవ కథ చెప్పుకుందాం - ఇందాకటి నుంచీ నువ్వు అమెరికా మీడియా గురించి ఆలోచిస్తున్నావ్ - ప్రపంచంలో జరిగే వార్తలు ఎక్కువగా అమెరికన్లకి, ఈ మీడియా తెలియనివ్వటం లేదని నిందలు కూడా వేశావ్ నీ మనసులో - అందుకే నీకు మిన్నిసోటా, అట్లాంటా వాళ్ళు ఆడే ఆటను వరల్డ్ సీరీస్ అని ఎందుకు అంటారనే అనుమానం కూడా



వచ్చింది - సో - ఇవాళ అమెరికన్ మీడియా గురించి మాట్లాడుకుందాం. మాట్లాడుకుందాం కాదు - నేను మాట్లాడ తాను. నువ్వు విను. విని నేను అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పి నీ బుర్ర వేయి ముక్కలు కాకుండా కాపాడుకో -" అన్నాడు భేతాళుడు.

"లేదు ఈసారి నీ కథలు వినను - ఇద్దరం మాట్లాడు కుందాం. నాకూ చెప్పవలసిన విషయాలు చాలా వున్నాయి - ముఖ్యంగా ఈ మధ్య ఇండియా ప్రధానమంత్రి నరసింహా రావ్‌గారు, అమెరికా వచ్చినప్పుడు, ఇక్కడ ఒక్క న్యూస్ పేపరు కూడా ఆయన గురించి వ్రాయలేదు. ఒక్క టి.వి. స్టేషన్ కూడా ఆయన గురించి ఏ వార్తా చూపించలేదు - అదే అంతకు ముందు, బెనజీర్ భుట్టో వచ్చినప్పుడు, టైమ్ లాంటి మ్యాగజైన్‌లు ఆవిడ ఫొటోని అట్టమీద అట్టహాసంగా ముద్రించాయి. టి.విలో ప్రతి ఛానల్ వాళ్ళు ఆవిడతో ఇంటర్వ్యూ, ఆవిడ ఇండియాని తిట్టిపోయటం - ఇది అన్యాయం కదూ -" విక్రమరావ్ అన్నాడు.

"కాదు - వాళ్ళ పేపరు - వాళ్ళ టి.వి., వాళ్ళ ఇష్టం - ఇక్కడ పత్రికా స్వాతంత్రం ఎక్కువ -" అగ్నిలో ఆజ్యం పోశాడు బేతాళుడు.

ఫర్ ఎ ఛేంజ్, చాల ప్రశాంతంగా అన్నాడు విక్రమరావ్ -"నాకూ జర్నలిజంలో ప్రవేశం వుంది బేతాళుడూ - ఇండియాలోనూ, యూరప్‌లోనూ, ఏసియాలోనూ, ఆమెరికాలోనూ - జర్నలిజాన్ని, పత్రికా రచయితల సమర్థతనూ, సంపాదకుల అభిప్రాయాలనూ, ప్రచురణకర్తల

నైతిక విలువలనూ, బాధ్యతలనూ, బాగా క్షుణ్ణంగా పరిశీలించాను కూడాను - కాని ఇక్కడ పత్రికారంగంలోనూ, టి.వి. తెర మీద చూసేవి మాత్రం విచిత్రంగా వుంటాయి. ఎవరు, ఎందుకు, ఎవర్ని కంట్రోల్ చేస్తున్నారో కొంచెం కొంచెంగా అర్థం అవుతున్నా, పత్రికా స్వాతంత్రం, నూటికి వంద శాతం వున్న దేశంలో, ఆ స్వాతంత్రాన్ని సరి అయిన పద్ధతిలో వాడటం లేదనిపిస్తున్నది -"

"మీ ప్రధాన మంత్రిగారు వచ్చివెళ్ళిన తర్వాత - 'ఇండియా ఎబ్రాడ్'- (అమెరికాలో ప్రచురింపబడే ఇండియన్ వార పత్రిక) పత్రికలో, నీ ప్రశ్నలకు జవాబులు వచ్చాయి. ఇక్కడ న్యూస్ రిపోర్టర్లనీ, టీ.వీ. వాళ్లనీ ఇంటర్వ్యూ చేశారు ఆ పత్రిక వాళ్ళు. వాళ్ళు ఏమన్నారో తెలుసా అమెరికా ప్రజలకు ఇండియా ప్రధాన మంత్రి గురించి ఎక్కువ తెలియదు - వాళ్ళకు తెలుసుకోవాలన్న ఆసక్తి కూడా లేదు - ఆయన రావటం, వెళ్ళటం అంతా మామూలుగా జరిగిపోయింది. ఏదన్నా అసాధారణ విషయం జరిగివుంటే, అన్ని పత్రికలూ, టీ.వీ. స్టేషన్లూ చెప్పి వుండేవి. ఏమీ జరగలేదు కాబట్టి ఆ విషయం గురించి చెప్పకుండా - ప్రజలకు కావలసినవి చెప్పారు -" అన్నాడు బేతాళుడు.

"నేను ఆ విషయంలో అంగీకరించను. జర్నలిస్టులు చెప్పవలసినవి ప్రజలు తెలుసుకొన వలసినవి అన్నీను - ప్రజలు వినటానికి ఉత్సాహపడతారు అని జర్నలిస్టులు ఎంచుకున్న వార్తలు మాత్రమే కాదు. వాళ్ళకు ఇవ్వవలసిన విషయాలన్నీ సమగ్రంగా ఇవ్వటం పత్రికల బాధ్యత. ఏది, ఎంతవరకు తీసుకోవాలో నిశ్చయించుకోవలసిన బాధ్యత పాఠకులది. పాఠకులు వెధవలు కారు. ఈరోజు వార్తలే, రేపు చరిత్ర పుస్తకాల్లో ఎక్కేవి" ఆగాడు విక్రమరావ్.

"ఈ డైలాగ్ ఆస్టిన్‌లో వున్నప్పుడు ఎప్పుడో విన్నట్టుందే-" సాలోచనగా అన్నాడు బేతాళుడు.

ఈలోగా వెయిట్రస్ పొగలు వస్తున్న ప్లేట్లు తెచ్చి బల్ల మీద పెట్టింది. "డు యు నీడ్ ఎనీథింగ్ మోర్" అన్నది.

అక్కర్లేదని చేయి ఎత్తి, చిరునవ్వు నవ్వాడు విక్రమరావ్.

ఆ అమ్మాయి వెళ్లగానే అన్నాడు బేతాళుడు - "ఆ - గుర్తుకు వచ్చింది - ఆస్టిన్‌లో సత్యం చెప్పాడీ కథ ఒకసారి - వాళ్లమ్మాయి అనుపమ మిడిల్ స్కూల్‌లో వుండగా - ఒకసారి స్కూల్ నించి రాగానే ఆయన్ని అడిగింది -

"నాన్నా - మా వరల్డ్ హిస్టరీ టీచర్ - ఇండియా గురించి చెబుతున్నది ఈ వారం. ఇవాళ ఏం చెప్పిందో తెలుసా - ఇండియాలో కొన్ని వేల మంది దేవుళ్ళు వున్నారట - అక్కడ రాతి విగ్రహాలకు, కోతులకు పూజలు చేస్తారు.. కోతి మెదడును తింటారుట - అక్కడ మనుషులకు తినటానికి తిండి వుండదట నిజమేనా-"

ఆ మాటలు విన్న సత్యానికి కోపం వచ్చింది. అప్పటికి మాత్రం వాళ్ల అమ్మాయితో,

"కాదు బంగారం - అదంతా తప్పు. ఆవిడ చెప్పింది చరిత్ర కాదు. పేపర్లో చదివిన పిచ్చి కబుర్లు. మీ టీచర్ సరిగ్గా చెప్పలేదు నీకు-" అన్నాడు సత్యం. "అయితే ఆవిడ చెప్పింది తప్పు అని నువ్వు ఫోన్ చేసి చెప్పరాదూ - అందరూ అదే నిజమనుకుంటున్నారు" అన్నది అనుపమ. సత్యానికి వాళ్ల అమ్మాయి చెప్పిన దాంట్లో సత్యం కనపడింది - అతనికి, మంచి కానీ, చెడు కానీ అభిప్రాయాలు చెప్పవలసి నప్పుడు చెప్పటం అలవాటు మాత్రమే కాక, ఒక బాధ్యతగా కూడా తీసుకుంటాడు. మనం చెప్పకపోతే అవతలి వాడికి ఎలా తెలుస్తుంది అని వాదిస్తాడు కూడాను. అఁ! నాలాటి వాడు - ఒక్క మనిషి - చెప్పినందువల్ల ఏం ప్రయోజనం అనుకునే బాపతు కాదు-".

"మళ్లీ - కథ మానేసి ఏవేవో చెబుతున్నావ్ బేతాళుడూ - నేనూ అమెరికాలో చాలా ఏళ్ళ నించీ వున్నాను - ఏ కొత్త విషయం కనిపెట్టినా, సంఘంలో ఏ కల్మషం కడిగి వేయాలన్నా - ఏదో ఒక్క మనిషి దగ్గరే ఆ అంకురార్పణ మొదలవుతుందని నాకు బాగా తెలుసు - ఇండియాలో ఈ విషయాన్ని నమ్మరు కానీ - ఇక్కడ ఆ బలమైన నమ్మకమే, ఈ దేశాన్ని అభివృద్ధిలోకి తెస్తున్నది - అది వేరే విషయం - అసలు కథలోకిరా -" అన్నాడు విక్రమరావ్.

"వస్తున్నానయ్యా - వస్తున్నాను - సత్యం వాళ్ల అమ్మాయితో కలిసి టీచర్కి ఒక ఉత్తరం తయారు చేశాడు. దాన్లో సారాంశం ఏమిటంటే - 'మీరు మా అమ్మాయికి ప్రపంచ చరిత్రలో పాఠాలు బాగా చెబుతున్నారు' అని 'మా అమ్మాయి కూడా అంటున్నది - మీకూ, మీ ఓపికకీ మా ధన్యవాదాలు - కానీ పోయిన వారం, భారతదేశం గురించి చెప్పిన విషయాలు, చరిత్రకు సంబంధించినవి కాకపోవటమే కాక, వాస్తవానికి కూడా చాలా దూరంగా వున్నాయి. ఉదాహరణకు ఇండియాలో కొన్ని వేల మంది దేవుళ్లు లేరు - హిందూ మతం నమ్మేది ఒకే ఒక దేవుడు ఉన్నాడని. అంతేకాదు దేవుడు ఎందెందు వెదికితే అందందే ఉన్నాడు అని కూడా నమ్ముతారు. కాకపోతే, దేవుడు సర్వాంతర్యామి, సర్వ రూపుడూ - అన్నీ - అని ఆ రోజుల్లోని పామరులకు కూడా అర్థం అయ్యేటట్లు - చాలా వివరణగా చెప్పిన వేదాంత సారాన్ని, పశ్చిమ దేశాల వాళ్లు అపార్థాలు చేసుకున్నారు. ఉదాహరణకి ప్రతి మనిషిలో దైవత్వం ఉందన్నారు. ఆ మనిషి జీవితంలోని మూడు ముఖ్యమైన ఘట్టాలు - పుట్టుక - బ్రతుకు - మరణం - మూడిటినీ మళ్లీ దైవ సంబంధంగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులుగా చిత్రించారు. అంతేకాక జీవితంలోని ప్రతి మంచి విషయానికీ, విలువలకీ దైవత్వం ఆపాదించారు. చదువులకు సరస్వతి, మాతృత్వానికి పార్వతి, శక్తికి దుర్గ, ధర్మానికి ధర్మరాజు, నిజాయితీకి రాముడు, సత్యానికి హరిశ్చంద్రుడు, బలానికి ఆంజనేయుడు - ఇలా. అదే విధంగా ప్రతి చెడు విషయాన్నీ, విలువలనీ, తప్పు అని కూడా పాత్రల ద్వారా చిత్రించారు. ఆ భావాన్ని అర్థం చేసుకొనటానికి, చేసిన సులువు మార్గం అది - ఎవరికి, ఆ దేవుడ్ని ఎలా మనసులో చిత్రించుకోవాలని వుంటే అలా చిత్రించుకోమని స్వాతంత్రం ఇచ్చిన మతం హిందూ మతం. అయినా ఆ రూపాలన్నీ ఒకే ఒక దేవుణ్ని సమర్థించేవే' - అని సత్యం ఆ

టీచర్‌కి వివరంగా వ్రాశాడు. అదీకాక, 'కోతుల్లోనే కాదు - ప్రతి మనిషిలోనూ, ప్రకృతిలోనూ - గాలీ, నీరూ, ఆకాశం, అగ్ని, భూమి, అంతా దైవమయం అని చెబుతున్నది హిందూమతం. విగ్రహారాధనలో, 'విగ్రహం' మనసులోని భావానికి రూపకల్పన మాత్రమే! ఏసుక్రీస్తు, మహమ్మదు పటాలను ఆ మతానికి చెందినవాళ్లు ఎందుకు గౌరవిస్తున్నారు? అది ఒట్టి కాగితమే కదా! - మీకు బాగా ప్రియమైన వాళ్ల - ఉదాహరణకి మీ అమ్మగారి ఫోటోని భద్రంగా దాచుకొనటం, ఒక విధమైన ప్రేమ, గౌరవంతో వాటిని చూడటం దేనికని? అది కోడక్ కంపెనీ వాళ్లు చేసిన ఫోటో గ్రాఫిక్ కాగితమే కదా! అక్కడ మనం ఇస్తున్న ప్రేమ, మర్యాద, భక్తీ కోడక్ కంపెనీ వారి కాగితానికి కాదు - మన మనసులో ముద్రించుకున్న రూపం - ఆ కాగితంలో వున్నందుకు. అలాగే విగ్రహారాధన గురజాల నించి తెచ్చిన బండరాయికి కాదు, ఆ రాతిలో చూస్తున్న రూపానికి - ఆ రాతిలో రూపాన్ని చూసుకోకుండా పూర్తిగా మనసులోనే, చిత్రించుకునే స్థాయికి ఎదిగినప్పుడు, ఆ రాయి అవసరం కూడా అక్ఖరలేదు. కోతి గుండె తినటంలాటి పిచ్చి చేష్టలు, హిందూమత ద్వేషులయయిన హాలీవుడ్ నిర్మాతలు, దర్శకులు డబ్బు కోసం కక్కుర్తిపడి తీసే గార్బేజ్ - అదీ కాక మతం అన్నది చరిత్రలో ఒక భాగమేమో కాని, అదే చరిత్ర కాదు. ఇండియా చరిత్ర చాలా వుంది - శాంతియుతంగా స్వాతంత్ర్యం సంపాదించుకున్న దేశం అది - ఇండియా చరిత్ర మీద మంచి పుస్తకాలు వున్నాయి. అవి చదివి, చరిత్ర చెప్పండి. టైమ్ మాగజీన్, న్యూయార్క్ టైమ్స్, వాషింగటన్ పోస్టు చరిత్ర చెప్పవు. ప్రజలకి ఆసక్తి కలిగించే విషయాలను, నాటకీయంగా చిత్రించి, డబ్బులు చేసుకునే వ్యాపార పత్రికలు అవి. ఈరోజు వార్తలే రేపటి చరిత్ర. వార్తలను సరిగ్గా చిత్రించవలసిన పత్రికలు, ఇలా డబ్బు కోసం దిగజారిపోవటం, అమెరికా ప్రజలకే కాదు, ప్రపంచ జర్నలిజానికీ దురదృష్టం-' అని ఉత్తరం వ్రాశాడు సత్యం. అదీకాక - 'ఇండియా గురించి అసలు చరిత్ర తెలుసుకోవాలంటే ఈ పుస్తకాలు చదవండి' - అని ఒక లిస్టు కూడా ఇచ్చాడు. 'ఒక రోజు మీ క్లాసుకి అతిథిగా వచ్చి, క్లాసు తీసుకోమంటే, వస్తాను - మా పిల్లతో కబురు చేయండి' అని కూడా వ్రాశాడు" - ఆగాడు భేతాళుడు.

"ఆయన రాసిన దాంట్లో చాలా యదార్థం ఉంది. గత ఐదేళ్లలోనూ, ప్రపంచ చరిత్ర తీసుకుందాం. పోయిన వంద సంవత్సరాల్లో, ఇంత చరిత్ర ఎన్నడూ జరగలేదు. రష్యాలో కమ్యూనిజం పూర్తిగా రూపు మాసి పోయింది. పోలెండ్‌లోనూ, మిగతా తూర్పు యూరప్‌లోనూ, కమ్యూనిజం దాదాపు చచ్చిపోయింది. జర్మనీలు రెండూ కలిసిపోయాయి. దక్షిణ ఆఫ్రికాలో నల్లవాళ్లు ప్రభుత్వం ఏర్పరిచారు. వెస్ట్ బేంక్‌లో జ్యూలు, పాలస్తీనా వాళ్లు చేయి చేయి కలుపుకున్నారు. చైనా కమ్యూనిజం వదలి వ్యాపార రంగంలో, పెట్టుబడిదారీ వ్యవస్థలో చాల చాల ముందుకు పోయింది. కొన్ని సంవత్సరాల క్రితం ఇవన్నీ కాదు - కనీసం వీటిలో ఒక్క విషయం అయినా జరుగుతుందని కూడా, ఎవరూ ఊహించలేదు. ఈ రోజు వార్తలే రేపటి చరిత్ర. కనుక అలాటి గొప్ప చరిత్రను సరిగ్గా వ్రాయవలసిన బాధ్యత జర్నలిస్టులది. ఆ బాధ్యతను విస్మరిస్తున్న వాళ్లల్లో అగ్రతాంబూలం, అమెరికన్ మీడియాది" అన్నాడు విక్రమరావ్.

నల్ల జుట్టు, ఎర్ర పెదిమల, తెల్ల స్పానిష్ అమ్మాయి వచ్చి ప్రక్కనే నుంచుని చిరునవ్వు నవ్వింది. నవ్వి - "కెన్ ఐ గెట్ సమ్ డెసర్ట్" అన్నది. అంటే అన్నం తిన్న తర్వాత - పాయసం లాటిదన్నమాట. తినేటప్పుడు కాలరీలు లెక్కపెట్టుకునే విక్రమరావ్, ఆ అమ్మాయి కళ్లల్లోకి చూస్తూ 'నో' అన్నాడు. కాలరీలు లెక్కపెట్టుకునే అవసరం లేని బేతాళుడు మాత్రం - స్ట్రాబెర్రీ - బనానా కేక్ ఆర్డర్ చేశాడు. దానిమీద రెడ్ వైన్ పోసుకు తింటే బాగుంటుందా, అని కూడా అడిగాడు, ఆ అమ్మాయి తెల్ల బుగ్గల మీద ఎర్ర రంగుని చూస్తూ. ఆ పాప "బాగుండదు" అనబోయి అమెరికాలో కస్టమర్ ఈజ్ ఆల్వేస్ రైట్ కనుక -"ఐ బిలీవ్ సో" అన్నది ఇంకోసారి నవ్వి.

ఆ అమ్మాయి వెళ్లగానే అన్నాడు బేతాళుడు - "ఇక్కడి పత్రికలకు, టి.వి.కి - కాంపిటీషన్ ఎక్కువ - ఈ దేశంలో ఎన్నో వేల పత్రికలు, కొన్ని వేల రేడియో స్టేషన్లూ, టి.వి. స్టేషన్లూ. ప్రజలు వీటిని పోషించాలంటే, వాళ్లను ఆకర్షించాల్సిన అవసరం వుంది ఈ మీడియాకి. సెన్సేషన్ వున్న వార్తలు అందిస్తే, వాళ్ల రేటింగ్ పెరుగుతుంది. ఎక్కువగా ప్రజలు వీళ్లని చదువుతారు, వింటారు, చూస్తారు. అప్పుడు ఎడ్వర్టైజ్‌మెంట్ల రేట్లు పెరుగుతాయి. వాళ్లకి డబ్బులు బాగా వస్తాయి. అందుకనే అవే ఎక్కువగా కవర్ చేస్తారు. నరసింహారావ్ గారు వచ్చి క్లింటన్‌తో దేశాభివృద్ధి గురించి, ఈ రెండు దేశాల స్నేహం గురించి మాట్లాడితే - దాంట్లో ప్రజలను కదిలించే సరుకు లేదు. అదే బెనజీర్ భుట్టో రాగానే ప్రతి మీటింగ్‌లోనూ, ఇండియా కాశ్మీర్‌లోని జనాన్ని కాల్చు తింటున్నదనీ, హిందువులు - ముస్లిములను నరికివేస్తున్నారనీ, న్యూక్లియర్ బాంబులు - పాకిస్తాన్ మీద వేయటానికి తయారవుతున్నారని - పెద్ద దుమారం పుట్టించింది. మీడియా వెంటనే అందుకుని - హడావుడి చేసి - డబ్బులు చేసుకుంది" -

"కానీ అది సబబు కాదు - ఆవిడ చెప్పే విషయాల్లో ఎంత నిజం వుంది? మీడియా అందించే ఇన్‌ఫర్‌మేషన్ నిజమా కాదా అని చూడవలసిన బాధ్యత - వీళ్లకు లేదా?" అన్నాడు విక్రమరావ్.

"వుంది - కానీ అవన్నీ, చెక్ చెయ్యటానికి సమయం లేదు - ఒక పత్రిక వాళ్లూ, టీవీ వాళ్లూ ఇవన్నీ చేస్తూ కూర్చుంటే మిగతా పత్రికల వాళ్లు ఈ లోపల డబ్బులు చేసుకుంటుంటారు. అందుకని ఎవరికి వాళ్లు హడావిడిగా - ఫస్ట్ టు మార్కెట్ - సిద్ధాంతం ప్రకారం, క్షణం కూడా ఆలస్యం చేయకుండా, టన్నుల కొద్దీ సెన్సేషనల్ ఇన్‌ఫర్మేషన్, వెదర్ ఇటీజ్ రైట్ ఆర్ రాంగ్ - దిగుమతి చేస్తారు -".

"అది జర్నలిజం కాదు - సెన్సేషనలిజం, కమర్షియలిజం" అన్నాడు విక్రమరావ్.

"అదేనయ్యా - కాపిటలిజం - సో వాట్? దట్ వర్క్స్ హియర్ - ఇక్కడ అది పని చేస్తుంది" అన్నాడు బేతాళుడు

విక్రమరావ్‌కి కోపం వచ్చింది. పాకిస్తాన్ అమెరికాకి మిత్ర దేశం. మొన్నటి దాకా

మిలటరీ ప్రభుత్వం - అయినా అమెరికన్ మీడియా పాకిస్తాన్‌నే గొప్పగా చిత్రించింది - ప్రజాస్వామ్యం అయినా ఇండియాని సమర్థించలేదు. ప్రపంచంలో ప్రజాస్వామ్య రక్షణా లక్ష్యం వున్న అమెరికా కువాయత్ - సౌదీ అరేబియా రాజుల పాలనలో వున్నా వాళ్లని సమర్థించింది. వాళ్లతో వ్యాపారం కోసం, చైనా కమ్యూనిస్టు అయినా, కాపిటలిస్టుల జాబితా లోకి చేర్చి, అమెరికన్ ప్రభుత్వం, మీడియా అక్కడ జరిగే హ్యూమన్ రైట్స్ వయొలేషన్స్‌ని పూర్తిగా మర్చిపోయాయి. మొన్నటి దాకా, దక్షణ ఆఫ్రికాలోని తెల్లవాళ్ల దురాచారాల గురించి ఏ పత్రికలోనూ సరిగ్గా వ్రాయలేదు. పాలస్థీనా వాళ్లని, చితకబాది, ఊచకోతను కోసిన ఇజ్రాయిల్‌ని, మీడియా ఖండించలేదు. ఇండియాలో - హైదరాబాద్‌లో ఒక ముస్లిమ్ - ఒక హిందూ కొట్టుకుంటే - అది వార్త - ఉత్తర భారతదేశంలో వెనకబడిన రాష్ట్రాల్లో జరిగే - స్త్రీల మీది దురాచారాలు వార్తలు - కానీ సాంకేతికంగా మనం సాధించిన విజయాలు



ఇక్కడ ఎవరికీ తెలీదు. మన సాహిత్యం గురించి గానీ, సంగీతం గురించి కానీ, సాంస్కృతికంగా ఎంత ఎదిగిననదీ ఒకసారి కూడా టి.వీ.లో కనపడదు - అమితాబ్ బచ్చన్ లాటి కమర్షియల్ తారలు (నటులు అన్న పదం వాడటం సమంజసం కాదు) చేసిన డిష్కుం, డిష్కుంలూ, వేసిన కుప్పిగంతులూ అమెరికన్ టీవీలో చూపించి ఇండియన్ సినిమాలు ఎంత అధోగతిలో వున్నాయో చూడండి అని చెప్పారు - అరవై నిమిషాలు అనే ఒక షోలో. అంతకన్నా చాలా గొప్ప నటులు, మంచి చిత్రాలు వాళ్లకి చూపించటం యిష్టం లేదు. హిందీ సినిమా ఒకటే ఇండియన్ సినిమా కాదు, వేరే భాషల్లో ఇంకా మంచి చిత్రాలు వస్తున్నాయి అన్న విషయం వాళ్లకి ఉత్తరాలు వ్రాసి చెప్పవలసి వచ్చింది -" స్ట్రాబెర్రీ బనానా కేక్ రావటం చూసి ఆగాడు విక్రమరావ్.

కేక్‌ని నెమ్మదిగా తింటూ అన్నాడు బేతాళుడు - "ఇవన్నీ అందరికీ తెలుసయ్యా - నువ్వు ఇండియా గురించి సరిఅయిన వార్తలు టీ.వీ.లో కనిపించాలన్నా, పేపర్లలో వినిపించాలన్నా ఒకటే మార్గం - మీరందరూ పేపర్లకు వార్తలు అందించండి - ఉత్తరాలు వ్రాయండి - నెమ్మదిగా ఆ మార్పుని తీసుకురావచ్చు. ఇక్కడి అమెరికన్ ప్రజలకు ఇండియా గురించి మంచి అభిప్రాయం కలిగించటం - నిజా నిజాలు విడమరచి చెప్పటం భారతీయులుగా మీ బాధ్యత - చెడును దాచవలసిన అవసరం లేదు. మంచిని చాటి చెబితే పాఠకులే, ప్రేక్షకులే నిర్ణయించుకుంటారు ఏది బుర్రలో ఉంచుకోవాలో, ఏది విసర్జించాలో."

అతన్ని ఆపుతూ అన్నాడు విక్రమరావ్ - "ఇంతకీ నీ పిట్ట కథ పూర్తి చేయలేదు - సత్యం వాళ్ళ అమ్మాయి - ఆ ఉత్తరం టీచర్ కిచ్చిందా - ఆ టీచర్ ఏమన్నది?"

నవ్వాడు బేతాళుడు - "ఆ జవాబు వూహించి చెప్పవలసినది నువ్వు - అది విక్రమార్కుడిగా నీ పాత్ర ఈ కథలో - నువ్వే చెప్పు -" అన్నాడు.

బేతాళుడు కేకు చప్పరిస్తుంటే - విక్రమరావ్ ఆలోచించాడు.

"ఓ.కె. - చెబుతాను - సత్యం ఆ లెటర్ అనుపమకి ఇచ్చాడు. అను వాళ్ళ టీచర్‌కి ఇచ్చింది. పది రోజుల తర్వాత వాళ్ళ టీచర్, తను చెప్పిన విషయాలు టైమ్ - లైఫ్ బుక్స్ నుంచి తీసుకున్నాననీ, అవి అంత పక్షపాతంగా వ్రాస్తాయని ఊహించలేదనీ - వ్రాసింది. వేరే పుస్తకాల రిఫరెన్స్ అడిగింది. సత్యాన్ని ఒక రోజు క్లాసుకు రమ్మని కూడా ఆహ్వానించింది. రెలిజియన్ చదువుతున్న నలుగురు పిల్లలు, హిందూ మతం మీద రిపోర్టు రాస్తున్నారనీ, వాళ్ళకి సత్యం సహాయం కావాలనీ వ్రాసి, వాళ్ళకి అతని చేత ఇంటర్వ్యూ కూడా ఇప్పించింది - అమెరికన్ ప్రజలకు మిగతా దేశాల విషయాలు తెలుసుకోవాలనే ఉత్సాహం వుంది. కానీ ఇక్కడి మీడియా వాళ్ళకి ఇచ్చే ఇన్‌ఫర్‌మేషన్‌లో వుంది లోపం. అది మార్చవలసిన అవసరం, బాధ్యత మనది. మా స్నేహితుడు అరుణ్ కుమార్‌గారు అమెరికన్ పత్రికలకు ఉత్తరాలు వ్రాసి చాలా ఇన్‌ఫర్‌మేషన్ ఇస్తుండేవారు - అదే జరిగింది ఈ పిట్ట కథలో కూడా -" జవాబు చెప్పి, ఎదురుగా చూసేసరికి బేతాళుడు అదృశ్యయమయాడు.

నల్ల జుట్టు, ఎర్ర పెదిమలు తెల్ల స్పానిష్ అమ్మాయి అందించిన 'బిల్' తీసుకుని, కౌంటరు దగ్గరకువెళ్ళాడు విక్రమరావ్.

❖